సాక్షి అనకాపల్లి

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



కేకేలైన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

విశాఖ: డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ శనివారం కె.కె.లైన్‌లో భద్రత తనిఖీలు నిర్వహించారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు.



ఉగాది పురస్కారం

విశాఖ: ఏయూ తెలుగు విభాగం ఆచార్యుడు డాక్టర్ బూసి వెంకటస్వామికి మద్రాస్ వర్సిటీ ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేసింది.

రంజాన్ వేళలు

అనకాపల్లి

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
అనకాపల్లి	6.15	4.33
నర్సీపట్నం	6.18	4.30





అనకాపల్లిలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పక్కన మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థులు ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, మలసాల, అనురాధ, సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు, చిత్రంలో ఎంపీ సత్యవతి, మలసాల భరత్ కుమార్

ఇది ధర్మపోరాటం

- రమేష్ ధనబలానికీ.. వైఎస్సార్‌సీపీ జనబలానికీ మధ్య సమరం
- ఐదేళ్లలో జగనన్న అందించిన సంక్షేమ, అభివృద్ధి వివరించి ఓటు అడగండి
- అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాలో క్లీన్ స్వీప్ తథ్యం
- వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, అనకాపల్లి: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌కు బ్యాంకుల నుంచి దోచుకున్న ధన బలం ఉంటే.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు సంక్షేమం, అభివృద్ధితో చేకూరిన జనబలం ఉందని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం అనకాపల్లి రింగ్ రోడ్డులో గల పెంటకోట కన్వెన్షన్ హాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అడుగడుగునా ప్రజా సంక్షేమానికి అడ్డుపడడమే కాకుండా తన బినామీలతో, ధన బలంతో వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూ పేదలను, వృద్ధులను, వికలాంగులను ఇబ్బందులకు గురిచేయడమే చంద్రబాబు నైజమని మండిపడ్డారు. వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేయించి రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులను ఇబ్బందులకు గురిచేశాడన్నారు. ప్రతీ గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలు, చంద్రబాబు ప్రేరేపిస్తున్న రౌడీ రాజకీయాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రతీ కార్యకర్తపై ఉందని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో కన్నా మిన్నగా అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుతోపాటు ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు అందరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

అందుబాటులో ఉంటా..

డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ సీఎం రమేష్ బ్యాంక్‌లను మోసం చేసి వేలాది కోట్లు దోచుకుని ఆ డబ్బుతో అనకాపల్లిలో ఓటర్లను కొనేందుకు కడప నుంచి రౌడీలను ఇక్కడకు దించాడన్నారు. డిప్యూటీ సీఎం అయినా.. ఎంపీ అయినా తనను **గెలిపించిన** నియోజకవర్గ ప్రజల కోసం వేప చెట్టు కిం**దే కూర్చుం**టానన్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి **వస్తే వలం**టీర్ వ్యవస్థను రద్దు చేసి జన్మభూమి **కమిటీలను** తీసుకొస్తానని ఇప్పటికే నారా లోకేష్ **పలుమార్లు** చెప్పారని, ఈ విషయాన్ని ప్రతీ కార్యక**ర్త ప్రజలకు** తెలియజేయాలన్నారు. మాడుగులను **ఏ విధంగా** మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దానో..**అదేవిధంగా** అనకాపల్లి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తానన్నారు.

ముత్యాలనాయుడు పక్కా లోకల్

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ స్థానికంగా మనకు సమస్యలొస్తే ముత్యాలనాయుడు అందుబాటులో ఉంటారు గానీ.. సీఎం రమేష్ కాదన్నారు. ఈ ఎన్నికలు పక్కా లోకల్.. నాన్ లోకల్ మధ్యే ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ మాట్లాడుతూ.. నేటి యువ ఓటర్లు పాత తరం నేతలను, వారి రాజకీయాలను కోరుకోవడం లేదన్నారు. ఎంపీ డాక్టర్ బి.వి. సత్యవతి మాట్లాడుతూ జిల్లాలో మరోసారి అన్ని స్థానాల్లో అత్యధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఎన్నికల కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడిలా సుబ్బారెడ్డి, అర్జునుడిలా ముత్యాలనాయుడు మార్గనిర్దేశం చేస్తున్నారని, వారి నాయకత్వంలో జిల్లాలో అన్ని నియోజకవర్గాలు గెలవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ పార్టీ నాయకుల మధ్య విభేదాలు సృష్టించడానికి దుష్ప్రచారానికి దిగుతున్నారని, నువ్వు నాకు ఓట్లు వేయించు.. నేను నీకు వేయిస్తానని తాను లాలూచీ పడుతున్నట్టు ఈమధ్య సీఎం రమేష్ చెప్పాడని, ఇలాంటి కుయుక్తులను పార్టీ క్యాడర్ సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. పాయకరావుపేట, పెందుర్తి, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థులు కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఈర్లె అనురాధ మాట్లాడుతూ సిద్ధం సభలకు, జగనన్నా మేమంతా సిద్ధం సభలకు వచ్చిన జనసందోహం చూస్తే రాష్ట్ర ఎన్నికల్లో మరోమారు ఫ్యాన్ స్పీడ్ ప్రభంజనం సృష్టించనుందని తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, శాసన మండలి విప్ వరుదు కల్యాణి, అనకాపల్లి పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు, చోడవరం పరిశీలకుడు కాశీ విశ్వనాథం, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంఎస్‌ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సత్యవతి, కార్పొరేటర్లు పీలా లక్ష్మీ సౌజన్య, కొణతాల నీలిమ, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ముఖ్యనాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

హోరెత్తిన బైక్ ర్యాలీ



పాయకరావుపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి, చిత్రంలో కంబాల జోగులు, చిక్కాల, తదితర నాయకులు



పెంటకోట నుంచి పాయకరావుపేటకు భారీ బైక్ ర్యాలీ చేపట్టిన నాయకులు, కార్యకర్తలు

పాయరావుపేట/నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి రాక సందర్భంగా కార్యకర్తల బైక్ ర్యాలీ శనివారం భారీ ఎత్తున జరిగింది. పెంటకోట గ్రామం నుంచి పాయకరావుపేటకు 13 కిలోమీటర్ల మేర నాయకులు, కార్యకర్తలతో ఈ భారీ ర్యాలీ సాగింది. మండలంలో గల 24 గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు గ్రామస్తులకు అభివాదం చేసుకుంటూ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునే వారు మనకు అవసరమా?

వార్డు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునే వారు మనకు అవసరమా మీరే ఆలోచించండి.. అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఆయన పాయకరావుపేటలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలను నూరు శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి జగనన్న పరిపాలన చేస్తుంటే నిర్మాణాత్మకమయిన ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన చంద్రబాబు నాయుడు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని అడ్డుకుంటున్నారన్నారు. పేదలకు 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తుంటే కోర్టును ఆశ్రయించి అడ్డుకున్నారన్నారు. ఇప్పుడు వలంటీర్లను అడ్డుకొని అవ్వా తాతల ఉసురు పోసుకుంటున్నారన్నారు. ఈ ఎన్నికలు పెత్తందార్లకు, పేదలకు మధ్య జరుగుతున్న సంగ్రామంలాంటిదన్నారు. అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వివిధ సంక్షేమ పథకాల రూపేణా జగనన్న రూ.2.80 లక్షల కోట్లు జమ చేశారన్నారు. ఈ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి సగటున రూ.3 లక్షలకు పైగా లబ్ధి కలిగిందన్నారు. మంచి చేశానని అనిపిస్తేనే వచ్చే ఎన్నికల్లో తనకు ఓటేయాలని జగనన్న ధైర్యంగా చెబుతున్నారన్నారు. కరోనా సంక్షోభంలో కూడా ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. సంక్షేమ పథకాలను యథావిధిగా ప్రజలకు అందించామన్నారు.



సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

కరోనా వచ్చినపుడు చంద్రబాబునాయుడు, అతని అభ్యర్థులు ఎక్కడ ఉన్నారో, ఏమయ్యారో మీ అందరికీ తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట అసెంబ్లీ అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంఎస్‌ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వార్షిక పరీక్షలు ప్రారంభం



యలమంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్, అనకాపల్లి: ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పేరిట నిర్వహిస్తున్న పరీక్షలు ఈ నెల 19 వరకు జరగనున్నాయి. శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉదయం తొమ్మిది గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఒకటో తరగతి విద్యార్థులకు ఈ నెల 16వ తేదీ వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 19 వరకు ముందుగా జారీ చేసిన టైం టేబుల్ ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈసారి బైలింగ్వల్ (ద్విభాష) విధానంలో పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలను బైలింగ్వల్ పద్ధతిలో ముద్రించిన సంగతి తెల్సిందే. పరీక్షలు ముగిసిన వెంటనే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి విద్యార్థుల ప్రమోషన్ జాబితాలు రూపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సమ్మేటివ్-2 పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని ఈ నెల 22వ తేదీన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి.. వారికి వివరించాలని అధికారులు పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు.

మత్స్యకారులకు పరామర్శ



మత్స్యకారులను పరామర్శిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, కోలా గురువులు

మహారాణిపేట: నడి సంద్రంలో బోటు తగలబడిపోయిన ఘటనలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మత్స్యకారులను శనివారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలాగురువులు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. గాయపడ్డ 9 మంది మత్స్యకారులు చికిత్స అందిస్తున్నామని వైద్యులు వివరించారు. తీవ్రంగా గాయపడ్డ శ్రీనుకు మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు మేయర్ సూచించారు.

పారదర్శక ఎన్నికల నిర్వహణకు చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: పారదర్శకత, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ కార్యకలాపాలు ఎప్పటికప్పుడు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల అధికారి సూచించిన ప్రకారం ఫార్మ్ డిస్పోసల్, ఎంసీఎంసీ రిపోర్ట్స్, ఎంసీసీ వయోలేషన్, గ్రీవెన్స్ కమిటీ, సిజర్ మేనేజ్‌మెంట్, పోలింగ్ పర్సనల్ రాండమైజేషన్ వంటి అంశాలపై తక్షణ చర్యలను అధికారులకు వివరించారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి చోట చెక్ పోస్టు ఏర్పాటు చేసి సక్రమంగా నిరంతరం నిర్వహణ చేస్తున్నామన్నారు. ఎన్నికల దృష్ట్యా ఇప్పటికే అనేక చోట్ల పోలీస్ బందోబస్తు కట్టుదిట్టం చేశామన్నారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చేపడుతున్న చర్యలను, నిర్వహిస్తున్న విధుల గురించి అడగ్గా, కలెక్టర్, ఎస్పీలు వివరించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, డీఆర్వో బి.దయానిధి, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, డీఎస్‌వో కె.వి.ఎల్.ఎస్ మూర్తి, డీఎంహెచ్‌వో హేమంత్, సీపీవో జి.రామారావు, మత్స్యశాఖ ఏడీ ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు డి.రామ్మూర్తి, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

ప్రచార పవనాలు ఆవిరి

- ఎండకు భయపడి యలమంచిలిలో మీటింగ్ రద్దు
- అనకాపల్లిలో నేడు పవన్ కల్యాణ్ బహిరంగ సభ
- గంట సమయంలో మీటింగ్ క్లోజ్
- మిగతా సమయమంతా ఏసీలోనే

సాక్షి అనకాపల్లి : 'పావలా' కోడికి...రూపాయి మసాలా...! అన్నట్టుగా ఉంది జనసేన పార్టీ హంగామా చూస్తుంటే. సేన ఎండలో మాడేసి జెండాలు పట్టుకుని తిరుగుతుంటే...అధినేత ఏసీలో సేద తీరుతూ కులాసాగా పార్టీకి ప్రచార నిర్దేశం చేస్తుంటారు. గతంలో వారాహి యాత్ర విడతల వారీగా సాగించి మమ అనిపించారు. ఇపుడు ఎన్నికల సమరం దగ్గర పడుతుంటే దుమ్ము పట్టిన లారీ యాత్రను మళ్లీ అనకాపల్లిలో ప్రారంభిస్తున్నారు. ఇది కూడా ముక్కుతూ మూలుగుతూ సాగేటట్టే కనిపిస్తోంది. ముందుగా జిల్లాలో యలమంచిలి, అనకాపల్లిలో రెండు రోజుల పాటు బహిరంగ సభలు, జనసేన కార్యకర్తలతో సమావేశం అని షెడ్యూల్ పంపించారు. కానీ ఇప్పుడు యలమంచిలి పర్యటన రద్దు చేసుకున్నారు. అనకాపల్లి టౌన్‌లో కూడా ఆదివారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు మాత్రమే బహిరంగ సభ ఉంటుంది. మిగతా సమయమంతా మళ్లీ ఏసీలోనే. నేరుగా రోడ్డు మార్గాన రాడీసన్ బ్లూ హోటల్‌కు చేరుకుని అక్కడే గడుపుతారు. ప్రజలతో మమేకమయ్యేది తక్కువ. అధినేత తీరుతో జన సైనికులకు మొదటి నుంచి నిరాశే మిగిలినా...కనీసం జనసేన నుంచి పోటీ చేసే ఆ 23 మంది అభ్యర్థులున్న చోటైనా ఎన్నికల ప్రచారం చేస్తాడేమో అని ఆశపడిన వారికి అధినేత ఝలక్ ఇచ్చినట్టే కనిపిస్తోంది. ఏదో మొక్కుబడిగా అనకాపల్లి వచ్చి సభ లో చంద్రబాబు స్క్రిప్ట్ చదివేసి వెళ్లిపోతారా...? ఎన్నికలకు 30 రోజులే ఉన్నా ఇంకా ఏసీ హోటళ్లకే పరిమితం అవుతారా? అని అభ్యర్థులు, జన సైనికులు విస్తుపోతున్నారు.

జనాల తరలింపునకు టోకెన్లు

తుమ్మపాల : టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు కలిసిపోయినట్టుగా కింది స్థాయి కార్యకర్తలు ఐక్యంగా ఉండలేకపోతున్నారు. రోజురోజుకీ వర్గ విభేదాలు పొడచూపుతున్నాయి. ఈ నెల 7న అనకాపల్లిలో పవన్‌కల్యాణ్ సభకు జనాల్ని తరలించేందుకు ఇక్కడ అసెంబ్లీ అభ్యర్థి కొణతాల ఆయన అనుచరుల ద్వారా మాత్రమే ఏర్పాట్లు చేయడం టీడీపీ కార్యకర్తలకు రుచించడం లేదు. కొణతాల వియ్యంకుడు పీలా గోవింద సత్యనారాయణ అనుచర వర్గమైన టీడీపీ కార్యకర్తలు దీనిపై గుర్రుగా ఉన్నారు. కుక్కలకు బిస్కెట్లు చల్లినట్టు కొణతాల అనుచరులు వచ్చి గ్రామాల్లో జనాల్ని తరలించాలని తమకు పెట్రోల్, భోజన టోకెన్లు ఇవ్వడమేంటని, వాళ్ల కింద పనోళ్లమా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శనివారం కొన్ని గ్రామాల్లో కొణతాల అనుచరులపై ఎదురుదాడి చేసినట్టు తెలిసింది.

భక్తుల కొంగుబంగారం నూకాంబిక



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

అభయ ప్రదాయని.. భక్తుల కొంగుబంగారమైన నూకాంబిక అమ్మవారి దర్శన భాగ్యం కోసం ఎంతోమంది పరితపిస్తుంటారు. ఎంత చూసినా తనివితీరని ఆ తల్లి రూపాన్ని మరోసారి తిలకించేందుకు మళ్లీ మళ్లీ వస్తుంటారు. ఈ దర్శనం కొత్త అమావాస్య జాతర రోజుల్లో అదో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతి కలిగిస్తుంది. ఈ మేరకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్న గవరపాలెం అమ్మవారి జాతరకు సర్వం సిద్ధమైంది.

- గవరపాలెంలో కొత్త అమావాస్య జాతర నేడు
- ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు
- ఎన్నికల కోడ్‌ను పాటిస్తూ మహోత్సవాలు
- గట్టి పోలీస్ బందోబస్తు

అనకాపల్లి: ఎన్నికల నిబంధనల ప్రకారం నూకాంబిక ఉత్సవానికి ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూకాంబిక ఆలయంలో ఈ నెల 8న కొత్త అమావాస్య వేడుకలు జరగనున్నాయి. ముందు రోజు 7న రాత్రి అమ్మవారి జాతర ప్రారంభం కానుంది. ఆదివారం రాత్రంతా భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. విద్యుద్దీపాల వెలుగులో ఆలయ పరిసరాలు దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. ఈ నెల 8వ తేదీ కొత్త అమావాస్య, 9న ఉగాది, మే 7న నెల పండగ ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ, పోలీస్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక శాఖతో పాటు వివిధ ప్రభుత్వశాఖ అధికారులు దేవాలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి జాతరకు వచ్చి దర్శించుకుని ఆలయ పరిసరాల్లో రోజంతా ఉండి సహపంక్తి భోజనాలు చేస్తారు. వారి కోసం చలువ పందిళ్లు, ఆలయంలో క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు మజ్జిగ, తాగునీరు, పులిహోర, చిన్నారులకు పాలు అందించే చర్యలు తీసుకున్నారు.

నాటి కాకతాంబే ..... నేటి నూకాంబిక

600 ఏళ్ల క్రితం 1,450వ సంవత్సరంలో నూకాంబిక అమ్మవారు తొలుత కాకతాంబగా ఇక్కడ వెలిశారు. అర్కాట్ నవాబు దగ్గర సైన్యాధిపతిగా పని చేసిన కాకర్లపూడి అప్పలరాజు కళింగాంధ్ర ప్రభువైన బహుబలేంద్రుడిని ఓడించి అనకాపల్లి కేంద్రంగా రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికి గవరపాలెంలో శత్రు దుర్భేద్యమైన కోటకు దక్షిణంగా తమ ఇలవేల్పు కాకతాంబ గుడిని నిర్మించారు. తర్వాత రాజ్యం చేతులు మారి వైరిచర్ల ఆనంద గజపతి రాజు వంశీయులు దేవస్థాన శాశ్వత ధర్మకర్తలుగా వ్యవహరించేవారు. ఈ ఆలయం1935లో దేవాదాయ శాఖ ఆధీనంలోకి వచ్చింది.

ట్రాఫిక్ కట్టుదిట్టం

జాతర నెల రోజులపాటు నిత్యం వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆదివారం లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారిని ఆనుకున్న వన్ వే ట్రాఫిక్ రోడ్డులోని, చిన నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద, ముఖ ద్వారం వద్ద, పూల్‌బాగ్ రోడ్ల మీదుగా ఆలయం వైపు వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు.



ఆలయ పునర్నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సుజాత

నిత్యాన్నదానం

భక్తులు అమ్మవారి మాలలు ధరించి పూజల్లో నిమగ్నమవుతారు. వీరంతా ఒక రోజు రాత్రంతా అమ్మవారి పాట ఏర్పాటు చేసుకొని ఉదయాన్నే వారి ఇంటి నుంచి కుటుంబ సమేతంగా అమ్మవారి ఘటాలను మోసుకుంటూ ఆలయానికి చేరుకుంటారు. వీరందరిని దృష్టిలో పెట్టుకుని అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిళ్లు

కొత్త అమావాస్య జాతరకు ప్రత్యే ఏర్పాట్లు

కొత్త అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ముఖ్యంగా వృద్ధులకు, చిన్నారులకు ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం కల్పిస్తామని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత తెలిపారు. శనివారం ఆమె ఇక్కడ జాతర ఏర్పాట్లు, ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ ఏడాది సీసీ కెమెరాల పర్యవేక్షణలో బాలాలయంలో జాతరన నిర్వహిస్తున్నామన్నారు. ప్రసాదాన్ని పరిశీలించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



కొత్త అమావాస్య జాతరకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా, ఉభయ గోదావరి, కృష్ణా, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. ఆలయ పరిసరాల్లో నెలంతా అగ్నిమాపక శకటాలు ఉంటాయి. ఈ నెల 26న అమ్మవారి మూలవిరాట్ దర్శనం భక్తులకు కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

– బండారు ప్రసాద్, ఆలయ ఈవో

క్లుప్తంగా

గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అనకాపల్లి : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు (పురుషులకు) ఈనెల 26 నుంచి ద్విచక్ర వాహనాలు, విద్యుత్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ 30 రోజుల పాటు ఇవ్వడం జరుగుతుందని సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించి, శిక్షణానంతరం సర్టిఫికెట్, టూల్ కిట్ బ్యాగ్స్‌తో పాటు బ్యాంకు ద్వారా రుణసౌకర్యం కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాలు గల అభ్యర్థులు ఆధార్ కార్డు, తెల్లరేషన్‌కార్డు కలిగిఉండాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8008333509 నంబరును సంప్రదించాలన్నారు.

కోడి పందాలపై పోలీసుల దాడులు

రాంబిల్లి: గోకివాడలో శనివారం కోడి పందాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. నలుగురు పందెం రాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ 3వేలు నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కోడిపందాలు జోలికి పోతే కేసులు తప్పవని హెచ్చరించారు.

దిమిలి, కట్టుబోలు సమీపంలో...

దిమిలి, కట్టుబోలు సమీపంలో రోజూ కోడిపందాలు జోరుగా సాగుతున్నాయి. పలు ప్రాంతాల నుంచి ఇక్కడకు పందెం రాయుళ్లు తరలి వస్తున్నారు. నిఘా లేకపోవడంతో పందాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి.

సుబ్బారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు



సుబ్బారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొత్తూరు టీడీపీ, జనసేన నాయకులు



సుబ్బారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన పెంటకోట గ్రామస్తులు

పాయకరావుపేట : మండలంలో గల కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేనకి చెందిన 50 కుటుంబాలు, పెంటకోట గ్రామానికి చెందిన 10 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెసు పార్టీలో శనివారం చేరారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జ్, రాజ్యసభ సభ్యుడు వై.వి. సుబ్బారెడ్డి వీరికి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు స్వగ్రామమైన పెంటకోట గ్రామానికి పార్టీ ప్రచారంలో భాగంగా సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చిక్కాల రామారావు ఆధ్వర్యంలో వీరందరూ పార్టీలోకి చేరారు. కొత్తూరు గ్రామానికి చెందిన వల్లూరు రాజాబాబు, కాటంరెడ్డి రాఘవ, కాటంరెడ్డి నాగేశ్వరరావు, వల్లూరు చినసూరిబాబు, గంద సత్యనారాయణ, దండ వీరబాబు, పెంటకోట గ్రామానికి చెందిన కోనాడ కాపులమ్మ, గంగిరి చిట్టెమ్మ, బొందు రమణమ్మ తదితరుల కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మే 13 న జరిగే ఎన్నికల్లో మీరందరూ సైనికుల్లా పని చేసి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించి, మరలా జగన్ మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేయడం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు బి.వి.సత్యవతి, ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, రాష్ట్ర ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ డి.వి. సూర్యనారాయణరాజు, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ అంగురి లక్ష్మి శివకుమారి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బాబూరావు, పార్టీ బీసీ సెల్ కార్యదర్శి యజ్జల అన్నవరం, ఎస్సీ సెల్ జోనల్ కార్యదర్శి కంబాల సందీప్, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, కె.కె.ఆర్.ఎస్ లత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

- దాదాపు 99శాతం నగదు అందజేత
- పింఛన్‌దారులకు ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం చర్యలు

సాక్షి, విశాఖపట్నం: పింఛన్‌దారులకు పెన్షన్ సొమ్ము అందకుండా చంద్రబాబు వేసిన ఎత్తులు ఫలించలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లకుండా ఎన్నికల సంఘం(ఈసీ) ద్వారా నిలువరించారు. దీంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ సొమ్ము కోసం మండుటెండలు, వడగాడ్పుల్లో సచివాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం.. బాబు ఎత్తుగడను, పింఛనుదారుల ఇబ్బందులను గమనించి పింఛన్ పంపిణీలో జాప్యం జరగకుండా సత్వర చర్యలు చేపట్టింది. సచివాలయాల్లో వీరికి పింఛన్ సొమ్ము వెనువెంటనే అందించేలా ఏర్పాట్లు చేసింది. పింఛన్‌దారులకు మంచినీరు, కుర్చీలు, షామియానాలు వంటివి సమకూర్చింది. ఇలా ఈ నెల నాలుగో తేదీ మధ్యాహ్నం నుంచి మొదలైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం పొద్దుపోయే వరకు కొనసాగింది. సచివాలయాలకు వెళ్లి పెన్షను అందుకోలేని వారు(మంచాన పడిన), అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగులకు వారి ఇళ్లకే సచివాలయ సిబ్బంది వెళ్లి సొమ్ము అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అలాంటి వారిళ్లకు సచివాలయ కార్యదర్శులు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి వచ్చారు.

'బీజేపీ అభ్యర్థి రమేష్‌ను వెంటనే అరెస్టు చేయాలి'



మాట్లాడుతున్న రెడ్డిపల్లి అప్పలరాజు

చోడవరం : పన్నులు కట్టని టైల్స్ దుకాణంపై తనిఖీలకు వచ్చిన డీఆర్ఐ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు శనివారం డిమాండ్ చేశారు. చోడవరం గాంధీ గ్రామంలో బుచ్చిరాజ్ టైల్స్ ట్రేడర్స్‌పై ఇటీవల జీఎస్టీ పన్ను చెల్లించలేదని డీఆర్ఐ అధికారులు దాడులు చేస్తే సీఎం రమేష్, స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్ రాజు తన అనుచరులతో వెళ్లి అధికారులను బెదిరించడం సరైందని కాదన్నారు.

సచివాలయ మహిళా పోలీసుపై టీడీపీ మాజీ ఎంపీటీసీ దాడి

- ఇంటికొచ్చి పింఛన్ నగదు ఇవ్వలేదని ఆగ్రహం

బుచ్చెయ్యపేట: కోర్టుకెళ్లి ఎన్నికల కమిషన్‌తో వలంటీర్ల సేవలను నిలిపివేసిన టీడీపీ నాయకులు ఇప్పుడు వితండవాదం చేస్తున్నారు. తాజాగా ఈ నెల పింఛన్ సొమ్ము తన ఇంటికొచ్చి ఇవ్వలేదని టీడీపీ మాజీ ఎంపీటీసీ ఓ మహిళా పోలీస్‌పై దాడి చేసింది. ఈ సంఘటన బుచ్చెయ్యపేట మండలం శివారు పంచాయతీ మంగళాపురంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అల్లంకి ఉమాదేవి అభయ హస్తం పింఛన్ కోసం గ్రామ సచివాలయానికి వెళ్లింది. అక్కడ పింఛన్ నగదు అందిస్తున్న మహిళా పోలీస్ జె. మహాలక్ష్మితో గొడవకు దిగింది. సచివాలయం లోపలకు వెళ్లకుండా బయట నుంచే తన వద్దకు వచ్చి పింఛన్ నగదు ఇవ్వాలని కేకలు వేసింది. వచ్చేది తమ ప్రభుత్వమేనని, సచివాలయ ఉద్యోగుల సంగతి చూస్తామంటూ బెదిరింపులకు దిగింది. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో ఉమాదేవి మహిళా పోలీస్ మెడపై చేయి వేసి గొంతు నొక్కి తోసేసింది. ఆమె మెడలో చైన్‌ను తెంచివేసింది. దాంతో అక్కడే ఉన్న మిగిలిన సచివాలయ ఉద్యోగులు అడ్డుకుని మాజీ ఎంపీటీసీ సభ్యురాలిని నిలదీశారు. అనంతరం మహిళా పోలీస్ బుచ్చెయ్యపేట పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఎస్ఐ ఈశ్వరరావును వివరణ కోరగా, స్టేషన్‌కు వచ్చారని ఇంకా ఫిర్యాదు తనకు అందలేదన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



గొలుగొండ : చీడిగుమ్మల గ్రామంలో రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు



నాతవరం : ఎంపీడీవో కార్యాలయం వద్ద వలంటీర్లు



మాకవరపాలెం : రాజీనామా పత్రాలు అందిస్తున్న జీ కోడూరు వలంటీర్లు

గొలుగొండ : మండలంలో పలు గ్రామాల్లో వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. చీడిగుమ్మల, జోగుంపేట, పప్పుశెట్టిపాలెం, రావణాపల్లి, ఏఎల్‌పురం, పాతమల్లంపేట, చోద్యం తదితర గ్రామ పంచాయతీల్లో సుమారుగా 89 మంది వలంటీర్లు రాజీనామాలు చేసి తమ రాజీనామా పత్రాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఇప్పటి వరకు ప్రజా సేవ కోసం పనిచేసామని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా ప్రజలకు అన్ని సేవలు అందించాలని తెలిపారు. చంద్రబాబు, పవన్ ఎల్లోమీడియా ఎన్ని కుట్రలు చేసినా వచ్చేది జగన్ ప్రభుత్వమేనని తెలిపారు. ఆయన కోసం ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తామన్నారు.

మాకవరపాలెం మండలంలో 58 మంది...

మాకవరపాలెం: మండలంలో మరో 58 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల నుంచి 160 మంది వలంటీర్లు రాజీనామలు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం జీకోడూరు, మాకవరపాలెం, జీవెంకటాపురం, తూటిపాల, కొండలఅగ్రహారం, గిడుతూరు సచివాలయాల పరిధిలోని 58 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో చంద్రరావుకు అందజేశారు.

నాతవరంలో...

నాతవరం : తమ రాజీనామాలతో వైఎస్సార్‌సీపీకి గ్రామాల్లో మరింత మద్దతు పెరుగుతుందని వలంటీర్లు అంటున్నారు. మండలంలో శనివారం సరుగుడు సుందరకోట వల్సంపేట, గునుపూడి, కె.వి.శరభవరరం పెద గొలుగొండపేట గమ్మడిగొండ పంచాయతీలకు చెందిన 79 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసి ఎంపీడీవో జాగరపు రాంబాబుకు అందజేశారు. అనంతరం వలంటీర్లు ఎంపీడీవో కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. వృద్ధులు వికలాంగులు వితంతవులను బాధపెట్టిన చంద్రబాబుకు వారి శాపం తగులుతుందన్నారు. ఈరోజు నుంచే జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంని చేసేందుకు, నర్సీపట్నంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విజయానికి అంకితభావంతో పనిచేస్తామని అన్నారు.

Collector's Office, Anakapalli

Rc.No.32 /2024/ SA-2 (Elections), Dated 06/04/2024

SHORT TENDER NOTICE

Sealed tenders are invited from Printers and service providers for Printing and Supply of "Updated Voter Guide" in Telugu & English (apporximately SIX LAKHS copies) for distribution to every household through BLOs during conduct of General Elections to HOP / APLA-2024 in Anakapalli district. Detailed services required as shown below.

Interested Printers and Service Providers concerned are requested to file sealed tender in Collector's Office, Anakapalli during office hours on or before 10-04-2024.

Sl. No	Item	Specifications
1	Printing & Supply of "Updated Voter Guide" in both Telugu & English. approximately six lakhs of copies	Printing & Supply of "Updated Voter Guide" (8 pages back to back) in both Telugu & English versions separately for distribution to every household through BLOs in Anakapalli district as per the reference communicated by the Chief Electoral Officer, AP, Velagapudi, Amaravathi

Terms and conditions:

1. They should deposit Rs.10,000/- as EMD in the shape of Demand Draft in favour of the Collector & District Election Officer, Anakapalli.
2. The printed material should be delivered within (7) days from the date of issue of purchase order as per the specifications mentioned above. Separate instructions will be issued for delivery of items.
3. The District Election Authority has every right to cancel the order, if the material is not supplied within time.
4. The payment will be made against the services as per the procedure.

K.V.L.N.Murthy
Nodal Officer and District Civil Supply Officer, Anakapalli

590 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

అనకాపల్లి, రోలుగుంట : గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి 590 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ.30.40 లక్షలు ఉంటుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు, రోలుగుంట, రావికమతం ఎస్ఐలు ఎల్.సురేష్, జి.ధనుంజయనాయుడు తమ సిబ్బందితో దాడులు జరపగా పెదపేట గంగాలమ్మ గుడి సమీపంలో గల సరుగుడు తోట ప్రదేశం నుంచి ప్యాక్ చేసి ఉన్న గంజాయిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. నిందితులు రోలుగుంట మండలం ఎం.కె.పట్నం పంచాయతీ శివారు ఎం.పెదపేటకు చెందిన కొదమ నాగరాజు(26), కె.కోటపాడు మండలం ఆర్లి గ్రామానికి చెందిన ప్రైవేటు పశు వైద్యుడు నంబరు రాజు(30), రోలుగుంట మండలం కొండపాలెం పంచాయతీ శివారు వెలంకాయపాలెం గ్రామానికి చెందిన వెలంకాయల కాశీరాజు (25)ను అదుపులోకి తీసుకుని వారి వద్ద గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు విలేకరులకు తెలిపారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి



వడదెబ్బకు మృతి చెందిన వృద్ధుడు ఎర్రమ్మ

రోలుగుంట : రెండు రోజులుగా ఎండలు, వడగాడ్పులు తీవ్రంగా ఉన్నాయి. వడగాడ్పులు తట్టుకోలేక శనివారం కుసుర్లపూడి గ్రామానికి చెందిన వృద్ధుడు గొల్లు ఎర్రమ్మ మృతి చెందాడు. ఇతని కుమారుడు గొల్లు రాజుబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన తండ్రి అయిన గొల్లు ఎర్రమ్మ శుక్రవారం ఎండలో వెళ్లి పింఛన్ తీసుకొని ఇంటికి వచ్చి సొమ్మసిల్లి పడిపోయాడన్నారు. శనివారం కాసిన వేడి గాలులు తట్టుకోలేక నీరసపడిన తన తండ్రి మృతి చెందాడని విలేకరులకు తెలిపారు.

క్లుప్తంగా

రేపు అన్నపూర్ణ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు

అనకాపల్లి : నాయుడుపేట సోహం ఆశ్రమంలో సోమవారం ఉదయం 9 గంటలకు అన్నపూర్ణ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని ఆశ్రమం వ్యవస్థాపకులు కాండ్రేగుల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు.

ఘనంగా గరగల ఊరేగింపు



అమ్మవారి గరగల ఊరేగింపులో పాల్గొన్న రాజేష్ తదితరులు

అనకాపల్లి: స్థానిక తాకాశి వీధి స్వయంభూ నూకాంబిక ఆలయంలో కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని శనివారం గరగల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తాకాశి రాజేష్, కన్నబాబు శనివారం ప్రారంభించారు. ఊరేగింపు అమ్మవారి ఆలయం నుంచి పట్టణంలో తాకాశివీధి, చింతావారి వీధి, కోట్ని వీధి, వేల్పులవీధి, మెయిన్‌రోడ్డు మీదుగా సాగింది. వచ్చే నెల 7వ తేదీ వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 7వ తేదీ రాత్రి నుంచి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తామన్నారు. జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామికి అభిషేకాలు చేసి, వజ్రకవచం, పూలదండలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

9న స్వర్ణ పుష్పార్చన

ధ్యాన వేంకటేశ్వరస్వామి మందిరంలో ఈ నెల 9న ఉగాదిని పురస్కరించుకొని 108 బంగారు పుష్పాలతో అర్చన చేయనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన అనంతరం విశేష అలంకరణ చేస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 5,483 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,230
మొదటి రకం	3,580	4,160
రెండో రకం	3,430	3,830
మూడోరకం	3,280	3,460

అనకాపల్లి సినిమాలు

భరతనాట్యం	: రాజా
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డీ)	: సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	: సత్యనారాయణస్క్రీన్-2
ఫ్యామిలీ స్టార్	: షిర్డీసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
మంజుమ్మెల్ బాయ్స్	: వెంకటేశ్వర
ప్రేమలు	: శ్రీసత్య
టిల్లు స్క్వేర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 43 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–20 యూనిట్లు, ఓ పాజిటివ్–11 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 464 మంది గ్యాస్ బుక్‌చేసుకున్నారు. గతంలో బుక్‌చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 08924223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

చేతికందిన పైకం.. పండుటాకుల హర్షం

ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చారు..



కశింకోట మండలం తాళ్లపాలేనికి చెందిన ఆచంటి చిలుకమ్మకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఆమె నడవలేని స్థితిలో ఉంది. గతంలో కూలి పని చేసేది. ఇప్పుడు వయసు మీద పడి నడవలేని స్థితిలో ఉండటంతో సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేశారు. గతంలో గ్రామ వలంటీర్లు ఇంటి వద్దే అందజేసేవారని, వీరు కూడా ఇంటికి అందించడం ఆనందంగా ఉందని చిలుకమ్మ పేర్కొన్నారు.

పెన్షన్ ఇంటికి రాకపోతే ఇబ్బందే..



కశింకోట మండలం కన్నూరుపాలేనికి చెందిన గోరుపాటి అప్పారావుకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. అతను వ్యవసాయ కూలీ. గతంలో పింఛన్ సొమ్ము గ్రామ వలంటీర్ ద్వారా ఇంటికి అందించేవారు. ఇప్పుడు వలంటీర్లు రాకపోవడం వల్ల ఇబ్బంది పడినట్లు తెలిపారు. సచివాలయానికి వెళ్లి తీసుకోవలసి వచ్చిందని అప్పారావు పేర్కొన్నారు. దీనివల్ల పనిపాటలు మానుకోవలసి ఉంటుందని అతనన్నారు.

ఏం పాపం చేశామని ఈ తిప్పలు..



మాది తుమ్మపాల. నేను దివ్యాంగుడిని. పుట్టుకతో అవిటితనం కావడంతో ఎక్కడికీ వెళ్లలేను. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెల వలంటీర్ ఇంటికొచ్చి పింఛను ఇచ్చేవారు. అయితే చంద్రబాబు వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్ ఇవ్వకూడదని చెప్పడంతో నాకు పింఛన్ ఇంటికి రాలేదు. సచివాలయానికి వెళ్లాలంటున్నారు. అక్కడికి వెళ్తే జనాల రద్దీ, మరోపక్క ఎండ తీవ్రతతో నీరసం వచ్చింది. రెండు రోజుల తర్వాత సచివాలయ సిబ్బంది నా సమస్య తెలుసుకుని ఇంటికొచ్చి పింఛను ఇచ్చారు. చంద్రబాబు పేదలకు సేవలందించే వ్యక్తి కాదు. అతని పాలన మాకు వద్దు.



కశింకోట సచివాలయంలో పింఛన్ల పంపిణీలో నిమగ్నమైన సిబ్బంది

- 99 శాతం పూర్తయిన పింఛన్ల పంపిణీ
- రావనుకున్న పింఛన్లు అందటంతో మురిసిపోయిన అవ్వాతాతలు
- జగన్‌బాబు వల్లే తమకు న్యాయం జరుగుతుందని ధీమా

కశింకోట/తుమ్మపాల: మండలంలో పింఛన్ల పంపిణీ ముగింపు దశకు చేరుకుంది. దాదాపు 99 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఇది గతం కంటే ఒక శాతం అధికం. ఎక్కడో అడపా దడపా మాత్రమే మిగిలాయి. వాటిని ఆదివారం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలో 20 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 10,667 వృద్ధాప్య, వికలాంగ, వితంతు, అభయ హస్తం తదితర పింఛన్లు ఉన్నాయి. గ్రామ వలంటీర్లను పింఛన్ పంపిణీ విధుల నుంచి తొలగించడంతో సిబ్బందితో ఈ నెల 3 నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేపట్టారు. అక్కడికి పింఛన్‌దారులు వచ్చి పింఛన్ సొమ్ము తీసుకున్నారు. నడవలేని వికలాంగులు, అనారోగ్యంతో మంచం మీద ఉన్న వారికి ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. శుక్రవారం నాటికే దాదాపు పింఛన్ల పంపిణీ పూర్తి అయింది. అలాగే అభయ హస్తం పింఛన్ల పంపిణీకి బ్యాంకు నుంచి నగదు అందడంతో శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇంకా కొన్ని సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని సమాచారం. వీటిని ఆదివారం పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఈ నెలతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి కానుంది.

పురాతన ఆలయానికి పూర్వవైభవం

- పూజలకు సిద్ధమవుతున్న సీతారామస్వామి
- శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

కశింకోట: కశింకోటలోని పురాతనమైన కోదండ సీతారామచంద్ర స్వామి ఆలయం పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది. కొద్ది రోజులుగా ఆలయ అర్చకుడు కనిపించకుండా వెళ్లిపోవడంతో స్వామికి ధూప దీప నైవేద్యాలు కరువయ్యాయి. దీంతో ఆలయాన్ని అనకాపల్లి దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. యువ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రేజేటి మారుతికి దేవదాయ శాఖ ఈవో కీర్తి శ్రీనివాస్ అర్చక బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆలయాన్ని ఉత్సవ మూర్తులను శనివారం శుభ్రం చేయించారు. అర్చకుడు మారుతి తన సొంత నిధులు రూ.22 వేలు వెచ్చించి, ఆలయానికి విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించి, అందంగా తీర్చి దిద్దుతున్నారు.

వందేళ్లు పైబడిన చరిత్ర కలిగిన ఆలయంలో శ్రీరామ నవమికి ఏటా సీతారాముల కల్యాణోత్సవం జరిపించేవారు. సుమారు పది రోజుల పాటు హరికథా కాలక్షేపం నిర్వహించే వారు. ప్రజలు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొనేవారు. క్రమేపీ ఆలయం నిర్లక్ష్యానికి గురి కావడంతో ప్రస్తుతం స్థానిక బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నామమాత్రంగా, సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం జరిపిస్తున్నారు. అయితే ఈ ఏడాది స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అలాగే ఆలయ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని నూతన అర్చకుడు మారుతి తెలిపారు. దీంతో ఆలయానికి మంచి రోజులు రానున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కోదండ సీతారామస్వామి ఆలయంలో పూజలకు సిద్ధం చేస్తున్న విగ్రహాలు

ఆయుర్వేద వైద్యంపై పెరిగిన ఆసక్తి

అనకాపల్లి: కరోనా వంటి విపత్కర సమయం నుంచి రోగులకు ఆయుర్వేద వైద్యంపై ఆసక్తి పెరిగిందని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్మాన్ భారత్ వైద్యాలయం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. భీమునిగుమ్మం రైల్వే స్టేషన్ రామాలయ ఆవరణలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల్లో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సుమారు 30 ఏళ్ల కిందట వైద్యాలయం ఆవరణలో ఆయుర్వేద ఆస్పత్రిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు ఆయుర్వేదంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని డాక్టర్ లావణ్య తెలిపారు. వైద్య శిబిరంలో 50 మంది రోగులకు వివిధ రకాలైన వ్యాధులకు ఆయుర్వేద మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయుర్వేద సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఆయుర్వేద వైద్యురాలు లావణ్య

వలంటీర్ రాజీనామా

కశింకోట: మండలంలోని జెట్టపురెడ్డితుని సచివాలయానికి చెందిన గ్రామ వలంటీర్ కొండ మాధవి రాజీనామా చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి మేరీజోన్స్‌కు శనివారం రాజీనామా లేఖను అందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించడంలో పాల్గొనలేకపోతున్నామన్న కారణంతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. దీనిలో ఎవరి ప్రమేయం, ఒత్తిడి లేదన్నారు.



రాజీనామా పత్రాన్ని కార్యదర్శికి అందిస్తున్న వలంటీర్ కొండ మాధవి

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుల చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన దాడి శ్రీనివాస్, అనుచర గణంతో మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పదేళ్ల నుంచి టీడీపీలో సీనియర్ నేత, విశ్రాంత ఎన్‌హెచ్‌ఏఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ దాడి శ్రీనివాసరావు శనివారం రాత్రి గడప గడపకు 81వ వార్డు (వేగి గౌరీష్‌వారి వీధి)లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. దాడి శ్రీనివాసరావుతోపాటు 25 మంది కుటుంబ సభ్యులకు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. బుద్ధ ప్రకాష్, మళ్ల ఈశ్వరరావు, రామకృష్ణతోపాటు మరో 21 కుటుంబాలు పార్టీలో చేరాయి. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

98.61 శాతం పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్: మండలంలో 98.61 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో ఆర్. కాశీ ప్రసాదరావు శనివారం సాయంత్రం తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ సాయంత్రం వరకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశామన్నారు. మండలంలో 11,998 పింఛన్లకు గాను 11,831 మందికి పంపిణీ చేశామన్నారు. మరో 167 మంది పింఛన్లు తీసుకోలేదన్నారు.

నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ వివరాలు..

దేవరాపల్లి మండలంలో 10,439 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 10,297 మందికి పంపిణీ చేసి 98.64 శాతం, చీడికాడ మండలంలో 8,845 మందికి గాను 8,752 మందికి పంపిణీ చేసి 98.95 శాతం పూర్తి చేశారు. కె. కోటపాడు మండలంలో 11,102 మందికిగాను 10,977 మందికి పంపిణీ చేసి 98.87 శాతం పూర్తి చేశారు.

రూ.73,510 నగదు సీజ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం ఒక వ్యక్తి నుంచి రూ.73,510 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. పెందుర్తి నుంచి అనకాపల్లి వైపు ఐస్‌క్రీమ్ తరలిస్తున్న వాహనాన్ని ఎస్ఎస్‌టీ టీమ్ సిబ్బంది తనిఖీ చేయగా నగదు పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్ అని చెప్పినా నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు చూపించకపోవడంతో సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న సారె ఊరేగింపు



నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు

మునగపాక : మండల కేంద్రంలో శనివారం రాత్రి నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంలో ఏర్పాటు చేసిన సారె ఊరేగింపు డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయం నుంచి గ్రామంలో సాగింది. నోరూరించే వంటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందని ఆలయ చైర్మన్ మళ్ల రామజగన్నాథం తెలిపారు. 8వ తేదీన అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రామాలయ స్థల దాతకు ఘన సన్మానం

బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెంలో రామాలయ నిర్మాణానికి విలువైన స్థలం అందించిన రైతు కొల్లిమల్ల అప్పారావు కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. స్థల దాత అప్పారావు, పైడితల్లమ్మల కుమారుడు అప్పలనాయుడు జ్ఞాపకార్థంగా రూ.25 లక్షల విలువైన ఐదు సెంట్లు స్థలం రామాలయ నిర్మాణానికి వితరణగా అందించారు. భీమునిపట్నం– నర్సీపట్నం రోడ్డుకు ఆనుకున్న స్థలం ఇవ్వగా, అప్పారావు దంపతులను శనివారం గ్రామ పెద్దలు సర్పంచ్ దరిమిశెట్టి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ గుద్దేటి పోతురాజు, వైస్ సర్పంచ్ గుద్దేటి శ్రీను, పాల సంఘం అధ్యక్షుడు ఒడ్డి రాము, మాజీ ఎంపీటీసీ కొప్పాక నరసింహం, బొబ్బిలి అప్పారావు, కొల్లిమల్ల ముత్యాలనాయుడు, ఒడ్డి సత్యారావు, వేపాడ అప్పలనాయుడు, కొశిరెడ్డి శ్రీనువాసరావు, బూరె రాజు, బొబ్బిలి అర్జునరావు, వెంకటస్వామి, కొశిరెడిడ్డి నాయుడు అభినందించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- 'కూటమి' కల్లబొల్లి మాటలు నమ్మొద్దు
- వైఎస్సార్‌సీపీ 'అనకాపల్లి' ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్
- 81వ వార్డులో ఇంటింటా ప్రచారం



సంతోషిమాతను దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్



81వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి కొంత మంది ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, 14 ఏళ్ల రాజకీయ అనుభవం గల చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌ను చూసి భయపడి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తున్నారని ఎద్దేవా చేశారు. 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో శనివారం రాత్రి మలసాల భరత్‌కుమార్, సతీమణి నివేదిత ఇంటింటా సార్వత్రిక ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా సంతోషిమాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు వెళ్లి మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా నాలుగేళ్ల 10 నెలల్లో సుపరిపాలన అందించామన్నారు. ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి జరగకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాలు నగదు జమ చేశామని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ సీనియర్ నేతలు కొణతాల మురళీకృష్ణ, కె.ఎం. నాయుడు, ఆళ్ల నాగేశ్వరరావు, దాడి బోగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి

జీవీఎంసీ విలీన గ్రామం 84వ వార్డు సిరసపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పని చేసి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈగల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏపీఐఐసీ డబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, అనకపల్లి నియోజకవర్గ అసెంబ్లీ పరిశీలకుడు శరగడం చిన్న అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేతలు కొణతాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిప్పులు చెరిగిన సూరీడు



నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు

కోటవురట్ల : సూరీడు నిప్పులు చెరిగాడు. మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచే వడగాడ్పులు వీచాయి. రహదారుల్లో ప్రయాణం నిప్పుల కొలిమిని తలపించింది. 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో చాలా వరకు జనం ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకే రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. మరో రెండు రోజుల పాటు ఇదే తరహా ఎండతీవ్రత ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. బయట తిరిగేవారు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మునగపాక : వేసవి ఉష్ణోగ్రతల్లో మార్పులు రావడంతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఉదయం 11 గంటలకే భానుడి ప్రతాపం కనిపిస్తుంది. దీంతో రైతులు తమ పొలం పనులు ముగించుకొని ఇంటిముఖం పడుతున్నారు. శనివారం 11 గంటలకే మునగపాక మెయిన్‌రోడ్డు నిర్మానుష్యంగా కనిపించింది. రాకపోకలు సాగించేవారు తలకు టోపీలు, మహిళలు చున్నీలు, చీర కొంగులు అడ్డం పెట్టుకుంటున్నారు. సాయంత్రం 4 గంటల వరకు ఎండ తగ్గకపోవడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామాల్లో గరగల సందడి

నక్కపల్లి : పల్లెల్లో గ్రామదేవతల పండగ సందడి మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో తమ ఆరాధ్యదేవతలైన నూకాలమ్మ, అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏటా కొత్త అమావాస్యకు 10 రోజుల ముందు నుంచి ఈ సందడి మొదలవుతుంది. గ్రామాల్లో రాత్రి సమయాల్లో గరగలు, ఘటాలు పేరుతో అమ్మవారి ప్రతిరూపాలను కొంత మంది పూజారులు నెత్తిన పెట్టుకుని నృత్యం చేస్తూ గ్రామాల్లో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా పలువురు అమ్మవారి ఘటాలకు పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. మరికొంత మంది తమ ఇళ్ల వద్ద అమ్మవారి ఘటాలకు సంబంధించి మొక్కులు తీర్చుకునే కార్యక్రమం చేపడతారు. నక్కపల్లి, ఉద్దండపురం, వేంపాడు, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, దేవవరం, కాగిత, నెల్లిపూడి, పాయకరావుపేట, మంగవరం, సత్యవరం, పెంటకోట సీతారామపురం, నామవరం తదితర గ్రామాల్లో నూకాలమ్మ జాతరను ఆదివారం నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఇలా పలు గ్రామాల్లో అమ్మవారి ఘటాలను తీసి రాత్రి సమయాల్లో ఊరేగిస్తున్నారు. పిల్లలు, పెద్దలు రాత్రంతా అమ్మవారి ఘటాలతో పాటు గ్రామమంతా తిరిగి సందడి చేస్తున్నారు. డప్పువాయిద్యాలు, నేలవేషాలతో కొత్త అమావాస్యవరకు గ్రామాలు సందడిగా ఉంటాయి. 10 రోజుల పాటు గ్రామాల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించి కొత్తఅమావాస్య ముందురోజు రాత్రంతా పెద్ద జాతర నిర్వహిస్తారు. ఆదివారం ఈ జాతర జరగనుంది. తెల్లవార్లూ నేల డ్యాన్స్‌లు, తప్పెటగుళ్లు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. నక్కపల్లి, వేంపాడు, దేవవరం తదితర గ్రామాల్లో ఈ నూకాలమ్మ జాతర చాలా ఘనంగా జరుగుతుంది.